30 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ముస్తాబైన పాగుంట వేంకటేశ్వరస్వామి ఆలయం
- జాతర ప్రాంగణంలో దుకాణాలు



లక్ష్మీవేంకటేశ్వరస్వామి మూల విరాట్



జాతర ప్రాంగణంలో వెలసిన ఆట వస్తువులు, జాయింట్ వీల్



ముస్తాబవుతున్న రథాలు

కేటీదొడ్డి: కోరిన కోర్కెలు తీరుస్తూ, భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న వెంకటాపురం పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. బుధవారం స్వామివారి కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ పెద్దలు తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. జాతర ప్రాంగణంలో మిఠాయి దుకాణాలు, రంగుల రాట్నాలు, జాయింట్ వీల్స్, వివిధ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రోడ్లు, విద్యుత్ సౌకర్యం తాగు నీటి సదుపాయాలు కల్పించేందుకు ఆలయ కమిటీ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.

ప్రత్యేక బస్సులు..

వేంకటేశ్వరస్వామి జాతరకు గద్వాల ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతారు. జిల్లా కేంద్రం నుంచి దాదాపు 30 కిలో మీటర్ల దూరంలో ఆలయం ఉంది. గద్వాల నుంచి రాయచూర్ మార్గంలోని కొండాపురం స్టేజీ కొండాపురం గ్రామం మీదుగా వెంకటాపురం చేరుకోవచ్చు

కార్యక్రమాలు ఇలా..

ఈనెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం పూజ కార్యక్రమం శుక్రవారం 10:30 స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం శనివారం సాయంత్రం 6 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు, కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారి పల్లకీ సేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎస్‌ఐ, సీడ్ ఆర్గనైజర్‌పై హత్యానేరం నమోదు చేయాలి

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్



రాజేశ్వరి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

మల్దకల్: ఎస్‌ఐతో పాటు సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డిపై హత్య నేరం నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బిజ్వారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన వడ్డె రాజేశ్వరి కుటుంబాన్ని గడ్డం లక్ష్మణ్‌తో పాటు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లే ముందు 41 నోటీసు ఇచ్చి మహిళా పోలీసుల సమక్షంలో విచారణ చేపట్టాలని, అయితే పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా రాజేశ్వరిని విచారణ చేపట్టడంతోనే బాలిక అవమానం భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని వారు పేర్కొన్నారు. రాజేశ్వరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోని అన్ని విధాల అండగా ఉండాలన్నారు. బాలిక మృతికి కారణమైన వారిపై కోర్టులో కేసు వేస్తామన్నారు. బాధ్యులైన వారిపై కలెక్టర్, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వారి వెంట పౌర హక్కుల సంఘం నాయకులు ఎండీ సుభాన్, బాలయ్య, మహాదేవ్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు



ఆత్మ గౌరవ సభకు తరలివెళ్తున్న మాల మహానాడు నాయకులు



అలంపూర్ చౌరస్తాలో బయలుదేరిన మాల మహానాడు నాయకులు

అయిజ: తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ లో నిర్వహించిన మాలల అత్మగౌరవ సభకు మండలం నుంచి నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహులు, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాల మల్లికార్జున్, మండల అధ్యక్షుడు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మాల నాయకులు నాగర్‌కర్నూల్‌లో జరిగే మాల మహానాడు సభకు అలంపూర్ నియోజకవర్గం నుంచి తరలి వెళ్లారు. కార్యక్రమంలో రంగస్వామి, మునిస్వామి, రవి, లక్ష్మణ, రామకృష్ణ, మహేష్, జగదీష్ ఉన్నారు.

'కార్యకర్తల అభిమానానికి రుణపడి ఉంటా'



అమరచింతలో కేక్ కట్‌చేస్తున్న సీతాదయాకర్‌రెడ్డి

అమరచింత: తమపై కార్యకర్తలు చూపుతున్న అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. సీతా దయాకర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని అమరచింత పట్టణంలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి తమకు వెన్నంటి ఉంటూ ఆదరిస్తున్న ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.మాజీ ఎంపీటీసీ పోసిరిగారి తిరుమలేష్, బుచ్చిరెడ్డి, పెద్దబాలరాజు, దేవరాజు, నందిమళ్ల రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరాజ్, చంద్రగడ్ రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాసన్నపాల్గొన్నారు.

పందులను దూరంగా తరలించండి

ఎర్రవల్లి: మండల కేంద్రంలో పెంపకదారులు ఇండ్ల మధ్యనే పందులను పెంచడం వల్ల అవి నిత్యం ఇండ్లచుట్టూ స్వైరవిహారం చేయటంతో మురుగు పెరిగి విషజ్వరాల బారిన పడుతున్నట్లు వివిధ కాలనీల వాసులు పేర్కొంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పందుల స్వైర విహారం వల్ల అపరిశుభ్రత పెరిగి దుర్వాసన వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని పందులను గ్రామానికి దూరంగా తరలించాలని కోరుతున్నారు.

కల్వర్టులను నిర్మించండి



సాసనూలు దగ్గర గుంతలు పడి కూలిపోయిన కల్వర్టు

ఎర్రవల్లి: మండలంలోని పలు గ్రామాల సమీపంలో ఆర్అండ్‌బీ రహదారులపై గతంలో నిర్మించిన కల్వర్టులు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో మండల కేంద్రం నుంచి రాజశ్రీ గార్లపాడు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై పలు కల్వర్టులు కూలిపోయి ఏండ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ దారి గుండా పదుల సంఖ్యలో గ్రామాలతో పాటు వివిధ మండలాలు ఉండటంతో వాహనదారులు కల్వర్టులపై ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్. గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి, గ్రామాల సమీపంలోని కల్వర్టులు కూలిపోయిన ప్రదేశంలో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలిపోయిన కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన విద్యార్థి

ఉండవెల్లి: హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను జిల్లా విద్యార్థి యువ నాయకులు మధు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఉన్నారు.

సంఘటితంగా పోరాడాలి



మాట్లాడుతున్న రాజు

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులంతా సంఘటితంగా పోరాడాలని పీఎస్‌వీఎస్ వ్యవస్థాపకుడు రాజు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పీడీఎస్‌యూ నడిగడ్డ విద్యార్థి జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు విద్యారంగంపై నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ నడిగడ్డ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అకేపోగు రాజు, నాయకులు చక్రి, రాజేష్, తిరుమలేష్, సురేందర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సుగుణకు ఘన నివాళి



మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

గద్వాల అర్బన్: సుగుణకు 21వ వర్ధంతిని పురస్కరించుకోని ఆదివారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో వివిధ సంఘాల నాయకులు సుగుణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుగుణ విద్యార్థి సంఘంలో చురుకుగా పాల్గొనేదని తెలిపారు. దామగుండం ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రైతు ఉద్యమకారుడు రైతు స్వరాజ్య వేదిక ప్రాజెక్టు వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ చెట్లను కొట్టేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ప్రొఫెసర్ సాయిబాబ సంస్మరణ సభ సందర్భంగా ఆయన జ్ఞాపకాలు, ఆయన జీవితాన్ని, ఉద్యమాలను వివరించారు. కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక కొండల్ రెడ్డి, సాయిబాబ తమ్ముడు రాందేవ్, వివిధ సంఘాల నాయకులు జ్యోతి, సుబాన్, విజయభాస్కర్, రవికుమార్, గోపాల్ యాదవ్, మధుసూదన్ బాబు, ఇక్బాల్ పాష, కుర్వ పల్లయ్య తదితరులు ఉన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

అమరచింత: కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ అన్నారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అనారోగ్యానికి బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచన మేరకు ఆదివారం లబ్ధిదారుడికి అందించారు. ఈసందర్భంగా ఆయూబ్‌ఖాన్ మాట్లాడారు. మహేందర్‌రెడ్డి, పోసిరిగారి విష్ణు, హనుమంతునాయక్, ప్రభుదాస్, ఆషు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేతనాలు చెల్లించాలి



గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి కృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 1000 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కార్తీక్, చంద్రాములు, బీచుపల్లి, రాఘవేంద్ర, భీమన్న తదితరులు ఉన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు



ధరూరు: ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గట్టు మండలం వెళ్లే రోడ్డు పలు చోట్ల ఆక్రమణలకు గురైంది. ఆ శాఖ అధికారులు మండల కేంద్రంతో పాటు బూరెడ్డిపల్లి, మార్లబీడు తదితర గ్రామాల్లో రోడ్డుకు ఆనుకున్న నిర్మాణాలను, కట్టడాలను తొలగించారు. ధరూరులో ఆలయం ముందు కట్ట రోడ్డుపై ఉందంటూ చదును చేశారు.

ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలి


రాజోళి: గత నెలలో అధిక వర్షాల కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం అందించి, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం నాయకుడు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'పరిహారం ..పరిహాసం' కథనంపై ఆయన స్పందించారు. ఇళ్లు కోల్పోయిన వారి వివరాల కోసం కలెక్టర్ గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీల ద్వారా విచారణ చేయించి వారికి తక్షణ సహాయం అందించడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. పరిహారం అందించే సమయంలో చాలా మందికి తెలియక దరఖాస్తు చేసుకోలేదని, మళ్లీ క్షేత్రస్థాయి విచారణ చేయించి బాధితులకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

వాయిద్య పరికరాలు అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన కొంకలి నర్సింహ ఆలయానికి రూ.38వేలు విలువ చేసే వాయిద్యానికి సంబంధించిన బ్యాండ్, క్యాసినో, మైక్ తదితర పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ వాయిద్య పరికరాలను వాయించడంపై గ్రామ యువతకు శిక్షణ ఇప్పించాలనే ఉద్దేశంతో మరో రూ.30వేలు చెల్లించి శిక్షకులు వర్ధన్, సంతోష్, రాజేష్‌ను నియమించినట్లు తెలిపారు. గ్రామంలో ఆసక్తిగల వారు శిక్షణను సద్వినియోగం చేసుకొని వాయిద్య పరికరాలను నేర్చుకోవాలని సూచించారు. గ్రామంలో ముమ్మందు సంప్రదాయ పద్ధతిలో వాయిద్య పరికరాలను వాయిస్తూ పండగలు, ఉత్సవాలు నిర్వహించాలని, అందులో భాగంగానే వాయిద్య పరికరాలు అందించానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నర్సింహను అభినందించారు.

పంటల రక్షణకు రైతన్నల అవస్థలు



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను సాగు చేసిన రైతులు అడవిపందుల బెడద నుంచి తమ పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ కట్టకు అనుసరించి ఏపుగా కంపతార చెట్లు పెరగడంతో అక్కడే అడవి పందులు ఆవాసాలు ఏర్పాటు చేసుకొని పంటలను నాశనం చేస్తున్నాయి. ఊరచెరువు, పల్లెచెరువు, సంగినేనిపల్లి పెద్ద చెరువు సమీపంలో వరి, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులు చీరలను రక్షణగా చుట్టి పంటలను కాపాడుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి 50 శాతం సబ్సిడీతో కంచెను అందజేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

సవాళ్లను అధిగమించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీదేవి

శాంతినగర్: విద్యార్థి దశలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను అధిగమించాలని మహిళా శిశు సంక్షేమశాఖ సభ్యురాలు లక్ష్మీదేవి విద్యార్థులకు సూచించారు. వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ సునీల్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి విద్యార్థులకు వివిధ అంశాలపై వివరించారు. సమాజంలో విద్యార్థుల పాత్ర, మంచి చెడు ప్రవర్తనలపై అవగాహన కలిగివుండాలన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలు వాటిని ఎదుర్కొనే విధానం, వివిధ చట్టాలు, వాటి ప్రాధాన్యత మొదలగు అంశాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ నరసింహ, కళాశాల సిబ్బంది వెంకటేష్, వడ్డేపల్లి అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుబాటకు సిద్ధమవుదాం



మాట్లాడుతున్న అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు

అయిజ: మున్సిపాలిటీలో, మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పోరుబాటకు సిద్ధమవుదామని అఖిలపక్ష కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని అఖిల పక్ష కమిటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, పట్టణ సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాలన్నారు. ఆమ్లేట్ గ్రామ పంచాయతీలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం, బస్సుపాస్ కౌంటర్ అయిజలో ఏర్పాటు చేయడం వంటి తదితర సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు వెంకట్రాములు, ఆంజనేయులు, పల్లయ్య, మద్దిలేటి, స్వామిదాసు, ప్రభాకర్, మారెప్ప, వీరేష, నీలకంఠం, నరసింహులు, రాఘవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



అయ్యప్పస్వాములకు నగదు అందజేస్తున్న వీరేష్‌గౌడ్ దంపతులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శబరిమల అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి శాంతినగర్‌కు చెందిన గౌడ సంఘం నాయకులు వీరేష్‌గౌడ్ రూ.2,11,113 విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని అయ్యప్పస్వాములు వీరేష్‌గౌడ్ ఇంటికెళ్లి కోరగా, ఆయన వెంటనే స్పందించి రూ.2 లక్షల నగదు అందజేశారు. కార్యక్రమంలో గురుస్వాములు ఉమామహేశ్వరస్వామి, భాస్కర్‌స్వామి, జయప్రకాష్‌రెడ్డి స్వామి, మధుస్వామి, సర్వేష్‌రెడ్డి స్వామి, రమేష్‌స్వామి, సునీల్‌స్వామి, గజేంద్రస్వామి, నరేష్‌రెడ్డి స్వామి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ మొక్కలను తొలగించాలి



అయిజలో కోనో కార్పస్ చెట్లను నరికేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలలో, మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉన్న కోనో కార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వివిధ పదేశాల్లో కోనో కర్పస్ మొక్కలను బీజేపీ నాయకులు నరికేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. భూ మండలంపై కోనో కార్పస్ వృక్షాలపై కనీసం పక్షులు కూడా వాలడం లేదని అన్నారు. వాతావరణ కాలుష్యానికి ఈ చెట్లు కారకమవుతున్నాయని, మనుషులకు అనేక వ్యాధులను కలుగజేసే ఈ చెట్లను అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భగత్‌రెడ్డి, వెంకటేష్, లక్ష్మణాచారి, లక్ష్మణ్ గౌడ్, నరసింహ, మధు, రఘు, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుకు మోక్షమెప్పుడో?



గుంతలమయంగా రాజోళి-వడ్డేపల్లి రోడ్డు

రాజోళి: రాజోళి-శాంతిగనర్ ప్రధాన రోడ్డులో సగభాగం పూర్తి కాగా, మిగతా రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజోళి శివారు వరకు రోడ్డు బీటీ పనులు పూర్తయ్యాయి. వడ్డేపల్లి శివారు నుంచి శాంతినగర్‌లోని రాయచూరు-కర్నూల్ ప్రధాన రహదారి వరకు రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో రెండు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు లభిస్తుందా? అని వాహనదారులు ఎదురుచేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు గుంతలమయంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా.. మోకాళ్లలోతు గుంతలు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. గత నెలలో వర్షాల సాకుతో అధికారులు రోడ్డు వేయలేదని, సాధారణ సమయంలో రోడ్డు పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కస్తూర్బాకు ప్రహరీ నిర్మించాలి



ప్రహరీలేని మల్దకల్ కస్తూర్బా గాంధీ పాఠశాల

మల్దకల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పశువులు, పందులు, మేకలు సంచరిస్తూ పాఠశాల పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాల ఎదుట గద్వాల-అయిజ ప్రధాన రహదారి ఉండటంతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చే సమయంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలి



శిథిలావస్థకు చేరుకున్న బిజ్వారం పశువైద్య కేంద్రం

మల్దకల్: మండలంలోని బిజ్వారం పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని పశువైద్యసిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.